

మే 1 నుంచి ఓటీఎస్ అమలు

ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో రుణం పొందిన రైతుల అభ్యర్థన మేరకు మే 1 నుంచి ఓటీఎస్ అమలు చేయనున్నారు.

- 8లో ▸



వీవోఏల నిరసన

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీవోఏలు చేపట్టిన సమ్మె బుధవారం నాటికి మూడో రోజుకు చేరింది.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.2 /21.9

ఉదయం ఎండ కాస్తుంది. మధ్యాహ్నం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

రేవంత్‌రెడ్డికి ఘనస్వాగతం



ఆర్మూర్: నిరుద్యోగ కార్నర్ ర్యాలీలో భాగంగా ఆదిలాబాద్‌కు వెళ్తున్న పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఆర్మూర్ వద్ద కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఘన స్వాగతం పలికారు. ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏబీ చిన్నా ఆధ్వర్యంలో ఆర్మూర్ శివారులోని ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం కాంగ్రెస్ నాయకులతో కలిసి రేవంత్‌రెడ్డి భోజనం చేశారు. కార్యకర్తలతో కాసేపు మాట్లాడి ఆదిలాబాద్ బయలుదేరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ, మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి పాల్గొన్నారు.

ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద..

ఇందల్వాయి: ఆదిలాబాద్ వెళ్తున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఇందల్వాయి టోల్ ప్లాజా వద్ద కాంగ్రెస్ నేతలు స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, పీసీసీ కార్యదర్శి నగేశ్‌రెడ్డి, నాయకులు శేఖర్ గౌడ్, సయ్యద్ ఖైసర్, వెల్మ భాస్కర్ రెడ్డి ఉన్నారు.

ఆర్టిజన్ల సమ్మె విరమణ

నిజామాబాద్‌నాగారం: విద్యుత్‌శాఖలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్లు రెండు రోజులుగా చేపట్టిన సమ్మెను విరమించారు. బుధవారం ఉదయం నుంచి ఉన్నతాధికారులతో చర్చలు జరిగాయి. ఎట్టకేలకు రాత్రి చర్చలు సఫలం కావడంతో సమ్మెను విరమిస్తున్నట్లు ఆర్టిజన్లు ప్రకటించారు. దీంతో బుధవారం రాత్రి నుంచే విధుల్లోకి వచ్చారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ట్రాన్స్‌కో, ఎన్పీడీసీఎల్ పరిధిలో సుమారు 900 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ట్రాన్స్‌కో పరిధిలో పనిచేస్తున్న 340 మంది ఆర్టిజన్లు సమ్మె నుంచి బయటకు వచ్చారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో 500 మంది ఆపరేటర్లు విధులు నిర్వహించగా ఇందులో కేవలం 100 మంది మాత్రమే సమ్మెలో పాల్గొన్నారు. వీరు కూడా విధుల్లో చేరారు.

11 మందిపై సస్పెన్షన్ ఎత్తివేత

సమ్మెలోకి వెళ్లిన 11 మంది ఉద్యోగులను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అయితే వీరిని తిరిగి వారం రోజుల్లో విధుల్లోకి తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

రైతులు దిగులు చెందొద్దు

■ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్‌నాగారం: అకాల వర్షాలతో రైతులు చేతికొచ్చిన పంట నష్టపోవడం బాధాకరమని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతన్నలారా దిగులు చెందకండి.. వెంటనే నష్టపోయిన పంటల వివరాలు సేకరించమని నిజామాబాద్, కామారెడ్డి కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఇప్పటికే వ్యవసాయ, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వివరాలు సేకరిస్తున్నారని మంత్రి రైతులకు భరోసా కల్పించారు. రేపటి వరకు పూర్తి వివరాలు తెప్పించుకుని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి నష్టపోయిన రైతులకు తగిన సహాయం అందే విధంగా ప్రయత్నం చేస్తామన్నారు.



బషీరాబాద్‌లో నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఏఈవో

అన్నదాత ఆగమాయె!

రెండు రోజుల పంట నష్టం వివరాలు	10,437	2,212	667	250
	వరి (ఎకరాల్లో)	నువ్వు (ఎకరాల్లో)	సజ్జ (ఎకరాల్లో)	మామిడి (ఎకరాల్లో)

- అకాల వర్షంతో 13,566 ఎకరాల్లో పంట నష్టం
- దెబ్బతిన్న వరి, నువ్వు, సజ్జ, మామిడి పంటలు
- ఆరబోసిన ధాన్యం పెద్దఎత్తున తడిసినట్లు అంచనా

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అకాల వర్షాలు రైతులను కోలుకోలేని విధంగా దెబ్బతీస్తున్నాయి. గత నెలరోజుల్లో నాలుగుసార్లు వర్షాలు కురవగా, గత సోమ, మంగళవారాల్లో కురిసిన వర్షాల కారణంగా నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 13,566 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అత్యధికంగా వరి పంట దెబ్బతిన్నది.

జిల్లా వ్యాప్తంగా..

■ మంగళవారం కురిసిన వర్షంతో మొత్తం 160 గ్రామాల్లో 7,276 మంది రైతులకు చెందిన 10,469 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో వరి పంట 85 గ్రామాల్లో 5,307 మంది రైతులకు చెందిన 8,005 ఎకరాలు దెబ్బతిన్నది. నువ్వు పంట 46 గ్రామాల్లో 1,411 మంది రైతులకు చెందిన 1,602 ఎకరాల్లో దెబ్బతిన్నది. 12 గ్రామాల్లో 441 మంది రైతులకు చెందిన 612 ఎకరాల సజ్జ పంటకు నష్టం వాటిల్లింది. మామిడి 17 గ్రామాల్లో 117 మంది రైతులకు చెందిన 250 ఎకరాల్లో దెబ్బతిన్నది.

■ సోమవారం కురిసిన వర్షంతో మొత్తం 39 గ్రామాల్లో 3,018 మంది రైతులకు చెందిన 3,097 ఎకరాల్లో పంటలు నష్టానికి గురయ్యాయి. ఇందులో వరి పంట 30 గ్రామాల్లోని 2,268 మంది రైతులకు చెందిన 2,432 ఎకరాల్లో, నువ్వు పంట 7 గ్రామాల్లోని 702 మంది రైతులకు చెందిన 610 ఎకరాల్లో, సజ్జ పంట 2 గ్రామాల్లోని 48 మంది రైతులకు చెందిన 55 ఎకరాల్లో దెబ్బతిన్నది.



ఎడపల్లిలో వర్షం నీటిలోని ధాన్యాన్ని తరలిస్తున్న రైతులు

ఆరబోసిన ధాన్యం సైతం..

జిల్లాలో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో అనేకమంది రైతులు కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం వర్షానికి తడిసిపోయింది. దీంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. గడిచిన నెలరోజుల్లో ఐదుసార్లు వర్షం కురవడంతో చేతికొచ్చిన పంట నీటిపాలైంది. నిజామాబాద్ మార్కెట్‌లో విక్రయానికి తెచ్చిన పసుపు రాశులు తడిసిపోయాయి. దీంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. కాగా అధికారులు వేసిన అంచనాల కంటే ఎక్కువగా పంట నష్టం జరిగినట్లు రైతులు చెబుతున్నారు.

24.2 మి.మీ. వర్షపాతం

సుభాష్‌నగర్: జిల్లావ్యాప్తంగా మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు 24.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో 27 మండలాల్లో అత్యధిక, 2 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. రానున్న రెండ్రోజులు కూడా ఉరుములు, మెరుపులతో ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తుందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

మండలం	వర్షపాతం	మండలం	వర్షపాతం
భీమ్‌గల్	40.4	చందూర్	29.3
వర్ని	40	కోటగిరి	33.7
బాల్కొండ	38.3	ధర్పల్లి	31
జక్రాన్‌పల్లి	38	రుద్రూరు	33.5
కోటగిరి	33.7	ఆర్మూర్	24.2
మెండోర	37.3	రూరల్	22.5
మోపాల్	31.8	డిచ్‌పల్లి	25.9
సిరికొండ	35.5	మోస్రా	25.0



చల్లగరిగెలో నేలరాలిన మామిడి కాయలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి



అడవి మామిడిపల్లిలో నేల రాలిన వరి ధాన్యం

రోజూ వాన పడుతోంది



యాసంగిలో వరిపంట చేతికొచ్చే సమయంలో రోజు వానా పడుతోంది. రాళ్ల వాన పడడంతో వరి గింజలు రాలిపోయాయి. ఉన్న గింజలను కోతకోసి ఆరబెట్టిన సమయంలో వర్షం పడడంతో తడిసిపోతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పెట్టడం లేదు. రోజూ ఆరబెట్టడం, వానా రాగానే కుప్ప చేయడంతో రెక్కలు ముక్కలవుతున్నాయి. – ధర్పల్లి నర్సయ్య, రైతు, రెంజర్ల

చిత్ర లేఖన పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన ధృతికి బహుమతి అందజేస్తున్న అదనపు కలెక్టర్



లక్ష్యాలను చేరుకోవాలి

విద్యార్థులు లక్ష్యాలను సాధించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. 'సాక్షి' ఆధ్వర్యంలో బుధవారం కాకతీయ ఒలంపియాడ్ స్కూల్‌లో నిర్వహించిన చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన లభించింది.

విద్యావర్ధిని సస్పెన్షన్

- అకడమిక్ కన్సల్టెంట్ శ్రీనివాస్ శాశ్వత తొలగింపు
- 2014 కెరీర్ అడ్వాన్స్‌మెంట్ ప్రమోషన్లు ఇచ్చేది లేదని తేల్చిన ఈసీ సభ్యులు
- టీయూలో అక్రమాలు, అవకతవకలపై ఈసీ కొరడా
- వచ్చే నెల 5న మరోసారి పాలకమండలి సమావేశం



విద్యావర్ధిని

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : తెలంగాణ యూనివర్సిటీలో వైస్‌చాన్స్‌లర్ చేసిన అవకతవకలు, అక్రమాల్లో పాలుపంచుకున్న వృక్షశాస్త్రం ప్రొఫెసర్ విద్యావర్ధినిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ పాలకమండలి తీర్మానించింది. బుధవారం హైదరాబాద్‌లోని రూసా భవనంలో టీయూ పాలకమండలి సమావేశం ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాకాటి కరుణ ఆధ్వర్యంలో జరిగింది. వీసీ ప్రొఫెసర్ రవీందర్ హాజరు కాకపోవడంతో వాకాటి కరుణ సమావేశానికి చైర్మన్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చ నిర్వహించి కొన్ని తీర్మానాలు చేశారు. పాలకమండలి అనుమతి లేకుండా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా వ్యవహరించిన విద్యావర్ధిని పదవీ కాలాన్ని గుర్తించేది లేదని నిర్ణయించారు. పైగా వీసీ విచ్చలవిడిగా చేపట్టిన అక్రమ నియామకాలు, ఆర్థిక అవకతవకల్లో పాలుపంచుకుని ఇష్టారీతిన సంతకాలు పెట్టినందున విద్యావర్ధినిని ప్రొఫెసర్ విధుల నుంచి సస్పెండ్ చేస్తూ తీర్మానించారు. ఈ సస్పెన్షన్ తక్షణం అమలులోకి వస్తుందని ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ ప్రకటించారు. ఆర్థిక అవకతవకలపై విచారణ పూర్తయ్యేవరకు విద్యావర్ధిని వర్సిటీలోకి రావొద్దని ఆంక్షలు పెట్టారు. విద్యావర్ధిని నిర్దోషిగా నిరూపించుకుంటేనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని నిర్ణయించారు. మరోవైపు అక్రమ మార్గంలో రూ.10 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్న అకడమిక్ కన్సల్టెంట్ శ్రీనివాస్‌ను ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగిస్తూ పాలకమండలి తీర్మానించింది.

ఏసీబీ విచారణకు నిర్ణయం

వర్సిటీలో వీసీ రవీందర్, విద్యావర్ధిని పాల్పడిన అవకతవకలకు సంబంధించి ఏసీబీకి సైతం ఫిర్యాదు చేసి విచారణ చేయించాలని నిర్ణయించారు. ఇక ఆర్థిక అవకతవకలు తేలేవరకు 2022–23, 2023–24 బడ్జెట్‌లను ఆమోదించేది లేదని పాలకమండలి తీర్మానించింది. ఇక 2014 వివాదాస్పద కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం ప్రమోషన్లను ఇచ్చే ప్రసక్తే లేదని ఈసీ సభ్యులు తేల్చేశారు. కాగా 2008 బ్యాచ్ కెరీర్ అడ్వాన్స్‌మెంట్ పదోన్నతులకు ఆమోదం తెలిపింది. ఇటీవల గుండెపోటుతో మరణించిన తెలుగు ప్రొఫెసర్ బాలశ్రీనివాసమూర్తి కుటుంబానికి రావాల్సిన అన్ని బెనిఫిట్స్‌ను చెల్లించాలని తీర్మానించారు. ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు. ఆర్థిక అవకతవకలపై విచారణ కోసం నియమించిన ఐదుగురు సభ్యుల కమిటీ గురువారం నుంచి పని ప్రారంభించాలని ఆదేశించారు. మే 5వ తేదీన అప్పటివరకు చేపట్టిన విచారణ వివరాలను అందించాలన్నారు. ఇక ఫైనాన్స్ వ్యవహారాల నిర్వహణ కోసం ఆడిట్ శాఖకు చెందిన రిటైర్డ్ అధికారిని నియమించాలని పాలకమండలి నిర్ణయించింది. స్క్రాప్ విక్రయించేందుకు ఈ-టెండర్లు పిలవాలని నిర్ణయించారు. మళ్లీ పాలకమండలి సమావేశం వచ్చే నెల 5వ తేదీన నిర్వహించేందుకు నిర్ణయించారు.

సమావేశంలో ప్రొఫెసర్ నసీమ్ మాట్లాడుతూ తాను డబ్బులు ఇవ్వకపోవడంతో తనకు రావాల్సిన కెరీర్ అడ్వాన్స్‌మెంట్ ప్రమోషన్‌ను వీసీ రవీందర్ ఇవ్వలేదన్నారు. అయితే ప్రొఫెసర్ యాదగిరి ఎంతిచ్చారు.. ఇస్తేనే ప్రమోషన్ ఇచ్చారా అని నవీన్ మిట్టల్ ప్రశ్నించారు. తన ప్రమోషన్‌కు సంబంధించిన ఆర్డర్ ఇవ్వలేదని రిజిస్ట్రార్ యాదగిరి చెప్పడం కొసమెరుపు. ఈ సమావేశంలో ఈసీ సభ్యులు గంగాధర్‌గౌడ్, వసుంధరా దేవి, రవీందర్‌రెడ్డి, ఎస్‌ఎల్ శాస్త్రి, మారయ్య గౌడ్, ప్రవీణ్, ప్రొఫెసర్ ఆరతి పాల్గొన్నారు.

గోదావరి హైబ్రిడ్ సీడ్ కంపెనీకి క్లీన్‌చిట్!

- 2008లో హింసాయుతంగా మారిన ఎర్రజొన్న రైతుల ఉద్యమం
- 15 ఏళ్ల పాటు కొనసాగిన కేసు

ఆర్మూర్ : ఆర్మూర్‌లో 2008లో ఎర్రజొన్న రైతుల ఉద్యమం హింసాయుతంగా మారిన ఘటనకు సంబంధించిన కేసులో అంకాపూర్ గ్రామానికి చెందిన గోదావరి హైబ్రిడ్ సీడ్ కంపెనీ యజమాని మహిపాల్‌రెడ్డికి ఇటీవల జిల్లా కోర్టు క్లీన్ చిట్ ఇస్తూ తీర్పును వెలువరించినట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే.. సీడ్ వ్యాపారులు సిండికేట్‌గా మారి తక్కువ ధర చెల్లిస్తున్న నేపథ్యంలో రైతాంగం ఉద్యమ బాట పట్టింది. అప్పటి కలెక్టర్ కలెక్టర్ రామాంజనేయులు సీడ్ వ్యాపారులు, రైతులతో సమావేశం ఏర్పాటు చేసి రైతులు పండించే ఎర్రజొన్న విత్తనాలన్నీ గోదావరి హైబ్రిడ్ సీడ్ కంపెనీ యజమానికే అమ్మాలని రాత పూర్వక ఒప్పందం కుదిర్చారు. అనంతరం రైతుల నుంచి సుమారు 5 లక్షల 11 వేల క్వింటాళ్ల ఎర్రజొన్నలను సీడ్ వ్యాపారి తీసుకున్నారు. 2 లక్షల 3వేల క్వింటాళ్లకు మాత్రమే రూ. 1,540 క్వింటాలు చొప్పున రైతులకు రూ. 32 కోట్లు చెల్లించాడు. తర్వాత ఎర్రజొన్నలు ఢిల్లీ మార్కెట్‌లో అమ్ముడుపోకపోవడం, వ్యాపారికి బ్యాంకు రుణం రాకపోవడంతో రైతులకు చెల్లించాల్సిన రూ. 46 కోట్లు చెల్లించలేనని చేతులు ఎత్తేశాడు. దీంతో ఆగ్రహించిన రైతులు రాజకీయాలకు అతీతంగా పలుమార్లు ఉద్యమాలు చేశారు. రైతు నాయకులుగా కోటపాటి నర్సింహం నాయుడు, ఆశన్నగారి జీవన్‌రెడ్డి, ప్రభాకర్, మారచంద్రమోహన్, పెద్దోళ్ల గంగారెడ్డి, సచ్చు చిన్న రాజన్న, దేవరాం ఆమరణ దీక్షకు పూనుకున్నారు. రైతులు 2008 జూన్ 16న 44వ, 63వ జాతీయ రహదారుల దిగ్బంధానికి పిలుపునిచ్చారు. రైతులు వేలసంఖ్యలో ఆర్మూర్‌కు తరలి రావడంతో ఉద్యమం అదుపు తప్పి హింసాయుతంగా మారింది. ఈ సందర్భంగా సీడ్‌వ్యాపారులు మహిపాల్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి ఇళ్లపై దాడులు జరిగాయి. వారి ఇళ్లను తగలబెట్టారు. మూడు ప్రభుత్వ వాహనాలకు నిప్పంటించారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో నలుగురు రైతులు గాయపడ్డారు. దిగొచ్చిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సీడ్ వ్యాపారి నుంచి సుమారు మూడు లక్షల క్వింటాళ్ల ఎర్రజొన్నలను స్వాధీనం చేసుకొని క్వింటాలుకు రూ. 1,200 చొప్పున రైతులకు రూ. 35 కోట్లు చెల్లించింది. రైతులకు బకాయి ఉన్న రూ. 10.83కోట్లను ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ రైతులకు చెల్లించారు. కాగా ఎర్రజొన్న వివాదానికి కారణమంటూ గోదావరి హైబ్రిడ్ సీడ్ కంపెనీ యాజమాన్యంపై అధికారులు సుమోటోగా కేసునమోదు చేశారు. అయితే రైతుల ఉద్యమానికి సీడ్ కంపెనీ యాజమాన్యానికి ఎలాంటి సంబంధం లేదని కోర్టు నమ్మినట్లు తెలిసింది. ఈ మేరకు పూర్తి స్థాయి విచారణ అనంతరం గోదావరి హైబ్రిడ్ సీడ్ కంపెనీపై పెట్టిన కేసును కొట్టి వేస్తూ తీర్పును ఇచ్చినట్లు సమాచారం.

సుమోటోగా కేసు నమోదు

అదే సమయంలో అప్పటికే తాను కొనుగోలు చేసి ప్రాసెసింగ్ చేసిన ఎర్రజొన్నలకు సంబంధించి రూ. 2.68 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలంటూ సీడ్ కంపెనీ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. 15 ఏళ్లపాటు జిల్లా కోర్టులో జరిగిన విచారణలో సీడ్ కంపెనీ యాజమాన్యం స్వాధీనం చేసుకున్న ఎర్రజొన్నలకు సంబంధించిన మొత్తాన్ని రైతులకు నగదు రూపంలో చెల్లించాలని చేసుకున్న ఒప్పందం ప్రకారం సీడ్ వ్యాపారి రైతులకు డబ్బులు చెల్లించినట్లు జిల్లా కోర్టు నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది.

అర్ధంతరంగా తొలగిస్తే ఎలా బతకాలి

- వీసీని కలిసిన డెయిలీవేజ్ సిబ్బంది
- మంత్రిని, ఎమ్మెల్యేను కలవండి : వీసీ
- అడ్వాన్స్ డబ్బులు మేమెలా చెల్లిస్తాం : వీసీ పీఏల ఆవేదన



తెయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్‌తో మాట్లాడుతున్న డెయిలీవేజ్ సిబ్బంది

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఏర్పాటులో విలువైన భూములు కోల్పోయిన తమకు డెయిలీ వేజ్ పేరిట వర్సిటీలో పనులు ఇచ్చినట్లే ఇచ్చి ఇప్పుడు అర్ధంతరంగా తొలగిస్తే తాము ఎలా బతకాలని నడిపల్లి తండాకు చెందిన పలువురు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల తర్వాత తెయూ వీసీ రవీందర్ క్యాంపస్‌కు వచ్చారు. ఈసీ అనుమతి లేకుండానే వీసీ వర్సిటీలోని మూడు క్యాంపస్‌లలో 147 మందిని డెయిలీవేజ్ పేరిట నియామకం చేసి వారికి వేతనాలు చెల్లించారు. ఈ నెల 19న హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఈసీ అనుమతి లేకుండా వీసీ చేపట్టిన నియామకాలు, పదోన్నతులను రద్దు చేస్తూ ఈసీ సభ్యులు తీర్మానం చేశారు. వెంటనే అక్రమంగా నియమించిన వారందరినీ తొలగించి, పదోన్నతులు రద్దు చేయాలని వారికి చెల్లించిన డబ్బులను రికవరీ చేయాలని ఈసీ నిర్ణయించింది. ఈసీ ఆదేశాల మేరకు నూతన రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన యాదగిరి ఈ నెల 20 నుంచి అన్ని విభాగాలల్లో పని చేస్తున్న డెయిలీ వేజ్ సిబ్బంది ఇకనుంచి విధుల్లోకి రావొద్దని ఆదేశాలు జారీ చేశారు. 23 మంది అవుట్‌సోర్సింగ్ పదోన్నతులు రద్దు చేస్తూ వారికి చెల్లించిన అధిక వేతనం డబ్బులను రికవరీ చేస్తామని నోటీసులు జారీ చేశారు. అడ్వాన్స్‌ల పేరిట తీసుకున్న డబ్బులను ఈ నెల 29 వరకు తిరిగి చెల్లించాలని లేదంటే చర్యలు తీసుకుంటామని వీసీ పీఏలుగా పని చేసిన నలుగురికి రిజిస్ట్రార్ నోటీసులు జారీ చేశారు. అక్రమ నియామకాలు, పదోన్నతులలో లక్షల రూపాయలు ముడుపులు చేతులు మారినట్లు ఇప్పటికే ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈసీ మీటింగ్ తర్వాత బుధవారం వీసీ క్యాంపస్ వచ్చిన విషయం తెలియగానే ముందుగా డెయిలీ వేజ్ సిబ్బంది వచ్చి ఆయనను కలిశారు. నిరుపేదలమైన తమను గతంలో ఒకసారి ఇలాగే నియమించుకుని తర్వాత తొలగించారని ఇప్పుడు మళ్లీ అలాగే చేస్తే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. నిబంధనల ప్రకారమే తాను వారికి పనులు కల్పించానని అయితే స్థానిక ఈసీ మెంబర్లు వారిని తొలగించాలని సంతకాలు పెట్టారని వీసీ తెలిపారు. ఈసీ మీటింగ్‌లో పాల్గొనేందుకు రిజిస్ట్రార్, ఈసీ మెంబర్లు హైదరాబాద్‌కు వెళ్లారని గురువారం వస్తే వారిని పిలిపించి మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని వీసీ పేర్కొన్నారు. లేదంటే జిల్లాకు చెందిన మంత్రి ప్రశాంత్‌రెడ్డిని, స్థానిక ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను వెళ్లి కలువాలని, తాను 300 అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు రికమండ్ చేస్తానని వీసీ తెలిపారు.

వారిద్దరూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు సన్నిహితులని అవుట్‌సోర్సింగ్‌గా మీకు నెలకు రూ.25 వేలు వేతనం వస్తుందన్నారు. అయితే తాము ఎవరినీ కలిసేది లేదని మీరే మా సమస్య పరిష్కరించాలని డెయిలీవేజ్ సిబ్బంది డిమాండ్ చేశారు. గురువారం మాట్లాడదామని చెప్పి వీసీ వారందరినీ పంపించి వేశారు.

వీసీకి గోడు వెల్లబోసుకున్న పీఏలు

తాము చిన్న ఉద్యోగులమని మీరు చెబితేనే అడ్వాన్స్ పేరిట డబ్బులు తీసుకుని మీకే ఇచ్చామని ఇప్పుడు వాటిని చెల్లించాలని రిజిస్ట్రార్ నోటీసులు జారీ చేశారని వీసీ పీఏలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వీసీ రవీందర్‌ను కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. అయితే అడ్వాన్స్ తీసుకున్న డబ్బులకు సంబంధించిన బిల్లులు ఇచ్చి సెటిల్‌మెంట్ చేసుకోవాలని వీసీ వారికి సూచించారు. అలాగే అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి తాను పదోన్నతులు ఇస్తే ఈసీ రద్దు చేయడం తగదని, తీర్మానాలపై ఇంటర్నల్ ఈసీ మెంబర్లు సంతకాలు ఎలా చేస్తారని వారిని ప్రశ్నించాలని వీసీ సూచించారు.

ఇద్దరికి కరోనా పాజిటివ్

నిజామాబాద్ సిటీ: జిల్లాలో బుధవారం నిర్వహించిన కరోనా పరీక్షల్లో ఇద్దరికి పాజిటివ్ వచ్చినట్లు జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుదర్శనం తెలిపారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 52 మందికి కరోనా పరీక్షలు చేయగా ఇద్దరికి పాజిటివ్‌గా తేలిందన్నారు. ప్రజలు తప్పనిసరిగ్గా మాస్కులు ధరించాలని ఆయన సూచించారు.

క్లుప్తంగా

ఓపెన్‌ బీఈడీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్‌: డాక్టర్‌ అంబేడ్కర్‌ ఓపెన్‌ వర్సిటీ బీఈడీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కోఆర్డినేటర్‌ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. మే 22వ తేదీలోగా బీఈడీ, స్పెషల్‌ బీఈడీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవలన్నారు. రిజిస్ట్రేషన్‌ ఫీజు రూ.1000 చెల్లించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు, వికలాంగులు రూ.750 చెల్లించాల్సి ఉంటుందన్నారు. జూన్‌ 6న ఎంట్రెన్స్‌ పరీక్ష ఉంటుందన్నారు. అలాగే ఓపెన్‌ వర్శిటీ డిగ్రీ ఫీజును మే 10 నుంచి చెల్లించాలని సూచించారు. వివరాలకు 7382929612 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బీఈడీ పరీక్షలకు 67 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బుధవారం జరిగిన బీఈడీ మొదటి సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షకు 1303 మంది విద్యార్థులకు 1236మంది హాజరు కాగా 67 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్‌ ఎం అరుణ తెలిపారు. అలాగే బీపీఈడ్‌ మొదటి సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షలకు 35మంది విద్యార్థులకు 31 మంది హాజరు కాగా 4 గురు గైర్హాజరైనట్లు తెలిపారు.

పిడుగుపడి మక్కజూడు దగ్ధం



భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్‌లో బుధవారం వేకువజామున పిడుగు పడింది. గ్రామానికి చెందిన వంగేటి ధర్మవ్వ వ్యవసాయక్షేత్రంలో ఉన్న మక్క జూడుపై పిడుగుపడటంతో కాలిపోయింది.

మూడు షాపులు దగ్ధం

ఎడపల్లి: ఎడపల్లిలో బుధవారం తెల్లవారుజామున మూడు షాపులు దగ్ధమై రూ.ఏడు లక్షల నష్టం జరిగిందని బోధన్‌ రూరల్‌ సీఐ శ్రీనివాసరాజు తెలిపారు. ఎడపల్లికి చెందిన అఖిల్‌ బైక్‌ మెకానిక్‌ షాపు కాలిపోయి రూ.నాలుగు లక్షలు, రహీంకు చెందిన పాత ఇనుప సామన్ల షాపు దగ్ధమై రూ.2 లక్షలు, రవికి హెయిర్‌ కటింగ్‌ షాపు దగ్ధమై రూ.50వేలు నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ఇదిలా ఉండగా గుర్తు తెలియని వ్యక్తులే నిప్పు పెట్టినట్లు షాప్‌ యజమానులు ఆరోపిస్తుండగా షార్ట్‌ సర్క్యూట్‌తో దగ్ధమైనట్లు బోధన్‌ రూరల్‌ సీఐ తెలిపారు.

తమ్ముడి హత్య కేసులో జైలుశిక్ష

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌కు చెందిన మక్కల రాజును హత్య చేసిన అతడి అన్న మక్కల శ్రీనివాస్‌,అతని భార్య మక్కల సుశీలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల బుధవారం జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో సురేశ్‌ బాబు తెలిపారు. పట్టణంలోని కమలా నెహ్రూ కాలనీకి చెందిన మక్కల రాజుకు తల్లి తండ్రులు లేక పోవడంతో సోదరుడు మక్కల శ్రీనివాస్‌ వద్ద నివాసముంటున్నాడు. తనకు వివాహం చేయమని రాజు నిత్యం మద్యం తాగి ఇంట్లో గొడవ పడేవాడు. ఈ క్రమంలో 2021 మే 12న మద్యం మత్తులో గొడవ పడిన రాజును అన్న శ్రీనివాస్‌ అతని భార్య సుశీలతో కలిసి తలపై కర్రతో బాది హత్య చేశారు. మృతుడి సోదరి రజిత ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో దాఖలు చేశారు. జిల్లా కోర్టులో బుధవారం కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుడు మక్కల శ్రీనివాస్‌కు పది సంవత్సరాల జైలు శిక్ష, రూ. 5 వేల జరిమానా, సుశీలకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.రెండు వేల జరిమానా విధించారు.

లక్ష్యాలను చేరుకోవాలి





సాక్షి మీడియా గ్రూప్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న చిన్నారులు

- అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌
- 'సాక్షి' చిత్రలేఖనం పోటీలకు విశేష స్పందన



సుభాష్‌నగర్‌: విద్యార్థులు వేసవి సెలవుల్లో ఆసక్తి ఉన్న క్రీడలను ఎంచుకుని సద్వినియోగం చేసుకోవాలని, కలలుగన్న లక్ష్యాన్ని చేరుకోవాలని అదనపు కలెక్టర్‌ బి చంద్రశేఖర్‌ సూచించారు. బుధవారం నగరంలోని కాకతీయ ఒలంపియడ్‌ స్కూల్‌లో సాక్షి మీడియా గ్రూపు ఆధ్వర్యంలో వేసవి శిబిరంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్‌ మాట్లాడుతూ పోటీల్లో అందరూ విజేతలేనని, బహుమతి రాలేదని ఎవరూ నిరుత్సాహపడవద్దని సూచించారు. ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారని, మంచి ఆలోచనలతో ముందుకు సాగాలని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు పోటీలు దోహదపడతాయని పేర్కొన్నారు. నేటి ప్రపంచంలో ప్రతి విద్యార్థి డాక్టర్‌, ఇంజనీర్‌గా స్థిరపడాలని కోరుకుంటున్నారని, పొలిటీషియన్‌గా కూడా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. ప్రజలకు సేవ చేసేందుకు పొలిటీషియన్‌ రంగం ఎంతో ఉత్తమమైందన్నారు. గతంలో ఇంటర్నెట్‌ అనేది చాలా అరుదని, ప్రస్తుతం ఇంటర్నెట్‌ సదుపాయం ప్రతి ఇంట్లోనూ అందుబాటులో ఉందన్నారు. ఇంటర్నెట్‌ విద్యార్థులకు ఎలాగైతే మేలు చేస్తుందో.. అంతే చెడు వ్యసనాలకు లోనవుతున్నారని పేర్కొన్నారు.



సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

వేసవి సెలవులను విద్యార్థులు సరదాగా గడుపుతూనే సద్వినియోగం చేసుకోవాలని కాకతీయ ఒలంపియడ్‌ స్కూల్‌ డైరెక్టర్‌ రామోజీరావు సూచించారు. ప్రస్తుతం నేర్చుకునే దశలో ఉన్నారని, సమయాన్ని వృథా చేయవద్దని తెలిపారు. సెల్‌ఫోన్లు, ఆన్‌లైన్‌ గేమ్స్‌, ఇతరత్రా వాటికి దూరంగా ఉండాలన్నారు. భవిష్యత్‌ లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని పేర్కొన్నారు. విద్యార్థి దశలో మెదడు చురుకుగా పని చేస్తుందని, నేర్చుకున్న ప్రతి అంశం గుర్తుంటుందని సూచించారు. లక్ష్యం కోసం సాధన చేయాలన్నారు. కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సాక్షి, ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్‌ నటరాజ్‌, అనంత్‌, బ్యూరో ఇన్‌చార్జి భద్రారెడ్డి, ఎడిషన్‌ ఇన్‌చార్జి ప్రభాకర్‌, ఆర్‌సీ ఇన్‌చార్జి సంజీవ్‌ తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌ చేతుల మీదుగా ద్వితీయ బహుమతి అందుకుంటున్న సులక్షు



మాట్లాడుతున్న కాకతీయ ఒలంపియాడ్‌ స్కూల్‌ డైరెక్టర్‌ రామోజీ



రామోజీకి జ్ఞాపిక అందజేస్తున్న అడిషనల్‌ కలెక్టర్‌



తృతీయ బహుమతి అందుకుంటున్న ఆశ్రిత



'సాక్షి'కి ధన్యవాదాలు



సమాజం కాలుష్యం బారిన పడకుండా, భూమిని ఎలా రక్షించుకోవాలనే ఉద్దేశంతో చెట్ల అవశ్యకతను తెలియజేస్తూ డ్రాయింగ్‌ వేశాను. మాలో ఉన్న స్కిల్‌ను వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయి. నేను వేసిన డ్రాయింగ్‌కు మొదటి బహుమతి రావడం సంతోషంగా ఉంది. సాక్షి మీడియా గ్రూప్‌నకు ధన్యవాదాలు.

– ధ్రుతి శాస్త్రి, ఎనిమిదో తరగతి, కాకతీయ ఒలంపియడ్‌ స్కూల్‌

అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాను..



బాల కార్మికుల నిర్మూలన అంశంపై డ్రాయింగ్‌ వేశాను. చదువుకోవాల్సిన పిల్లలు బడి బయట కార్మికులుగా పని చేస్తున్నారు. రోడ్డుపై వెళ్తున్న క్రమంలో చాలా మందిని గమనించాను. పని చేస్తున్న పిల్లలను చూసినప్పుడే వారి గురించి డ్రాయింగ్‌ వేయా లని అనుకున్నాను. సాక్షి ఆ అవకాశాన్ని కల్పించడంతో సద్వినియోగం చేసుకున్నాను.రెండో బహుమతి రావడం ఆనందంగా ఉంది.

– సులక్షు, ఏడో తరగతి, కాకతీయ ఒలంపియడ్‌ స్కూల్‌

సంతోషంగా ఉంది



గ్రామీణ ప్రాంత విశిష్టతను తెలియజేసే డ్రాయింగ్‌ వేశాను. పల్లె వాతావరణం, తాతయ్యలు, అమ్మమ్మ, నానమ్మలు, చుట్టూ పంట పొలాలు, చెట్లు, పశు సంపద ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. తాతయ్య, అమ్మమ్మ, నానమ్మలు రాత్రి సమయాల్లో చెప్పే కథల సారాంశమే డ్రాయింగ్‌. పోటీల్లో మూడో బహుమతి రావడం సంతోషంగా ఉంది.

– ఆశ్రిత, ఏడో తరగతి, అభ్యాస స్కూల్‌

నైపుణ్యం వెలికితీయడానికి దోహదం



పిల్లల్లో నైపుణ్యం వెలికి తీయడానికి పోటీలు ఎంతగానో దోహదపడతాయి. వేసవి సెలవుల్లో ఒత్తిడికి లోనుకాకుండా రిలాక్స్‌ కోసం విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థుల్లో పోటీతత్వం కూడా పెంపొందుతోంది. సాక్షి గ్రూపు మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

– లావణ్య, డ్రాయింగ్‌ టీచర్‌

విద్యార్థులకు ఎంతో ఉపయోగం



వేసవి సెలవుల్లో సాక్షి మీడియా విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిబిరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. సెలవుల్లో వీరికి వారి నైపుణ్యాలను ప్రదర్శించేందుకు అవకాశం లభించింది. ఇలాంటివి మరెన్నో నిర్వహించాలి. విద్యార్థులు చదువుతోపాటు ఇతర రంగాల్లో ఉన్న ఆసక్తిని బయటికి తీయవచ్చు.

– శ్రీలత, కళాశాల ఇన్‌చార్జి

దెబ్బతిన్న పంటల వివరాలను అందించాలి



సాలూరాలో పంటలను పరిశీలిస్తున్న డీఏవో

బోధన్‌రూరల్‌: రెండు, మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను వ్యవసాయ వీస్తీర్ణ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను అందించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్‌ పరిశీలించారు. బుధవారం సాలూర శివారులో అకాల వర్షాలకు నెలకొరిగిన వరి, మొక్కజొన్న పంట, తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. దెబ్బతిన్న పంటల సంరక్షణ కోసం రైతులకు తగు సూచనలు అందించాలని ఆయన వ్యవసాయ అధికారులకు సూచించారు. ఆయన వెంట ఏవో సంతోష్‌, సాలూర సొసైటీ సీఈవో బస్వంత్‌రావు, ఏఈవోలు సాయి చరణ్‌, అనుజ, అపర్ణ రైతులు ఉన్నారు.

చోరీ అయిన సెల్‌ఫోన్‌ నుంచి రూ.1.32 లక్షలు మాయం

భిక్కనూరు: చోరీ అయిన మొబైల్‌ నుంచి డబ్బులు మాయం అయ్యాయి. భిక్కనూరుకు చెందిన బోగరి సంతోష్‌కుమార్‌ ఫోన్‌ ఆదివారం జరిగిన సంతలో పోయింది. ఈ విషయమై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం మరో సెల్‌ఫోన్‌ను కొనుగోలు చేసి సిమ్‌ కార్డు వేశాడు. తన కొత్త ఫోన్‌లో అన్ని యాప్‌లన డౌన్‌లోడ్‌ చేసుకున్నాడు. తన బ్యాంక్‌ ఖాతాలో ఉన్న రూ.1.32 లక్షలు మాయమైనట్లు గుర్తించాడు. వెంటనే బ్యాంక్‌కు వెళ్లి విచారించగా యూపీఐ ద్వారా తమిళనాడులోని మరొకరి ఖాతాకు బదిలీ చెప్పారు. దీంతో సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆత్మీయ సమ్మేళనం



జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో 2003–04లో పదో తరగతి చదివిన విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మున్నూరు కాపు సంఘం భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వారికి చదువు చెప్పిన గురువులు హెచ్‌ఎం రాంచందర్‌, ఉపాధ్యాయులు రాజేశ్వర్‌, శ్రీనివాస్‌రెడ్డి, నాగనాథ్‌, నరహరి, చైతన్య, మమత, మాణిక్యం హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు గంట సుధాకర్‌, మల్లికార్జున్‌, సుమన్‌, రాజు, నరేందర్‌, రవీందర్‌, నవీన్‌, గోపాల్‌, శ్రావణ్‌, సురేష్‌, అఫ్రిన్‌, సవేరా, వనమాల, వినోద, వనజా, సుమలత, సుకన్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి



బాలయ్య(ఫైల్‌)

తాడ్వాయి: తాడ్వాయికి చెందిన పని బాలయ్య(30) జారి పడి మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. బాలయ్య మంగళవారం సాయంత్రం వర్షం పడుతున్న సమయంలో తన పొలం నుంచి తన ఇంటికి వస్తుండగా గ్రామంలో వడ్ల వెంకటేశం ఇంటి ముందర ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ్డాడు. ఆయన కుటుంబ సభ్యులు అక్కడికి వచ్చి అపస్మారక స్థితిలో ఉన్న బాలయ్యను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య రేణుక, కుమారుడు ప్రదీప్‌, కుమార్తె రక్షిత ఉన్నారు. బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..



రాములు మృతదేహం

సిరికొండ : సిరికొండ మండలంలోని హుస్సేన్‌నగర్‌ గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన డప్పు రాములు (50) మృతి చెందాడు. రాములు బంధువైన జలందర్‌తో కలిసి బైక్‌పై మండలంలోని గడ్కోల్‌కు బంధువుల ఇంటికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో బైక్‌ అదుపుతప్పి కిందపడిపోయారు. వెనుక కూర్చున్న రాములుకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌ నడుపుతున్న జలందర్‌కు గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో సిరిసిల్లలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నర్సింలు తెలిపారు.

తాటిపల్లివాసి..

సిరికొండ: రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం వట్టిమల్ల గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన లింగు ఆనందం(55) మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన ప్రకారం వివరాలు.. ఆనందం భార్య లక్ష్మీతో కలిసి అత్తగారి ఊరైన వట్టిమల్లలో పెద్దమ్మ పండుగ కోసం వెళ్లాడు. ఇంటి వద్ద మేకలను కట్టేసేందుకని సాయంత్రం ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. వట్టిమల్ల చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో బస్సు వెనుక చక్రాల కింద పడి మృతి చెందాడు.

మే 1 నుంచి జూన్‌ 30 వరకు ఓటీఎస్‌ అమలు



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

సుభాష్‌నగర్‌: ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో రుణం పొందిన రైతుల అభ్యర్థన మేరకు ఏక కాల పరిష్కారం (ఓటీఎస్‌) గడువును మే 1 నుంచి జూన్‌ 30 వరకు అమలు చేయాలని నిర్ణయించినట్లు ఎన్‌డీసీసీబీ బ్యాంకు చైర్మన్‌ పోచారం భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు బుధవారం జిల్లా సహకార కేంద్రబ్యాంకులో చైర్మన్‌ అధ్యక్షతన పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పోచారం భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మార్చి 31, 2023 వరకు కాలపరిమితి ముగిసి బ్యాంకు ద్వారా బట్వాడా చేసిన సొసైటీల ద్వారా తీసుకున్న రుణాలపై అపరాధ వడ్డీ 100శాతం మాఫీ, వాయిదా మీరిన వడ్డీపై 30శాతం మాఫీ చేస్తామని తెలిపారు. ఎల్‌టీ రుణాలు, మార్టిగేజ్‌, ఎన్‌ఎఫ్‌ఎస్‌, జేఎల్‌జీ, ఎస్‌హెచ్‌జీ రుణాలపై వడ్డీ 32శాతం మాఫీ చేస్తామన్నారు. మే 1 నుంచి జూన్‌ 30 వరకు ఈ స్కీమ్‌ అమల్లో ఉంటుందన్నారు. అర్హులైన రుణగ్రస్తులు ఓటీఎస్‌ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకుని బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని సూచించారు. వివరాల కోసం సంబంధిత సొసైటీలు, బ్రాంచ్‌ మేనేజర్లను సంప్రదించాలని కోరారు. వైస్‌ చైర్మన్‌ రమేష్‌రెడ్డి, సీఈఓ గజానంద్‌, డైరెక్టర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

రుద్రూర్‌: మోస్రా మండల కేంద్రానికి చెందిన గోపరి మహేష్‌ (32) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. మూడు రోజుల క్రితం మహేష్‌ బైక్‌ అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుక్కల దాడిలో జింక..



మృతి చెందిన జింక

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌లో బుధవారం ఉదయం కుక్కలు దాడి చేయడంతో జింక మృతి చెందింది. ఆర్ట్స్‌ కాలేజీ సమీపంలోని ముళ్ల పొదల వద్ద జింక మృతదేహాన్ని గమనించిన కొందరు విద్యార్థులు, నాన్‌ టీచింగ్‌ సిబ్బంది వర్సిటీ ఎస్టేట్‌ ఆఫీసర్‌ అశోక్‌వర్ధన్‌, యాదగిరికి సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని జింక మృతదేహాన్ని ఇందల్వాయి అటవీ అధికారులకు అప్పగించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బీబీపేట: తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చొరబడి నగలు ఎత్తుకెళ్లిన ఘటన బీబీపేటలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్‌ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గుర్రాల సిద్దరాంలు గత నెల 27న ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి ఈ నెల 25న ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూశాడు. వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. బీరువాలోని 16 గ్రాములు బంగారం, అంతే కాకుండా రూ.800 విలువ గల బ్యాటరీ ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి అదృశ్యం



మద్నూర్‌: మండలంలోని అంతాపూర్‌ గ్రామానికి చెందిన నందకుమార్‌ గత నెల 31న తప్పిపోయినట్లు ఎస్సై కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. నందకుమార్‌(35) మానసిక స్థితి బాగాలేదని, గత నెల ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంత వరకు తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పరారైన బాలురలో ఒకరి ఆచూకీ లభ్యం

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌లోని నాగారంలోని జువైనల్‌హోం నుంచి పరారైన నలుగురు బాలురలో ఒకరి ఆచూకీ లభించిందని ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌ మహమ్మద్‌ ఒమర్‌ తెలిపారు. ఆదిలాబాద్‌కు చెందిన బాలుడి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్‌ ఇచ్చి బాలుడిని జువైనల్‌ హోంకు తరలించినట్లు చెప్పారు. శుక్రవారం రాత్రి నలుగురు బాలురు పరారీ అయిన విషయం తెలిసిందే. ఇంకా ముగ్గురి ఆచూకీ లభించాల్సి ఉన్నట్లు చెప్పారు.

బహిరంగంగా మద్యం తాగిన ముగ్గురిపై కేసు

గాంధారి: బహిరంగ ప్రదేశంలో మద్యం తాగి న ముగ్గురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్‌ తెలిపారు. మండల కేంద్రం శివారు ప్రాంతంలో బహిరంగంగా మ ద్యం తాగుతున్న గాంధారికి చెందిన భాస్కర్‌, ఎండీ మహమ్మద్‌, గుజ్జుల్‌ తండాకు చెందిన జరుపులా ప్రకాశ్‌పై కేసు నమోదు చేశామన్నారు.

మన ఊరు – మన బడి పనులు పూర్తి చేయాలి



దేవునిపల్లి ప్రభుత్వ పాఠశాలను సందర్శిస్తున్న టీఎస్‌ఈడబ్ల్యూడీసీ రాష్ట్ర చైర్మన్‌ శ్రీధర్‌రెడ్డి

కామారెడ్డి టౌన్‌ : మన ఊరు మన బడి కార్యక్రమం కింద చేపడుతున్న పాఠశాల భవనాల నిర్మాణం పనులను మే 31 లోపు పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్య, సంక్షేమ, మౌలిక వసతుల సంస్థ(టీఎస్‌ ఈడబ్ల్యూడీసీ) చైర్మన్‌ రావుల శ్రీధర్‌ రెడ్డి అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్లో బుధవారం ఆయన ఇంజినీరింగ్‌, విద్యాశాఖ అధికారులతో మన ఊరు మన బడి పనులపై సమీక్ష నిర్వహించారు. అన్ని భవనాల్లో మౌలిక వసతులు కల్పించే విధంగా చూడాలన్నారు. జిల్లాలోని 23 మండలాల్లో నిర్మిస్తున్న భవన నిర్మాణాల పురోగతిపై ఇంజినీరింగ్‌, విద్యాశాఖ అధికారులను ఆరా తీశారు. ఉపాధి హామీ పథకం ద్వారా అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు, వంటశాలలు, రక్షణ గోడ నిర్మాణం పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌, అదనపు కలెక్టర్‌ వెంకటేష్‌ ధోత్రే, డీఈవో రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ

జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి, రాజంపేట, గర్గుల్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలు, తిమ్మక్‌ పల్లి, దేవునిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలను బుధవారం శ్రీధర్‌ రెడ్డి తనిఖీ చేపట్టారు. గ్రీన్‌ చాక్‌ బోర్డ్స్‌, డబుల్‌ డెస్కులు, పెయింటింగ్స్‌ పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.

రాజంపేట: రాజంపేటలోని ప్రాథమిక, బాలికల ఉన్నత పాఠశాలలను ఎస్‌ఈడబ్ల్యూడీసీ రాష్ట్ర చైర్మన్‌ శ్రీధర్‌ రెడ్డి సందర్శించారు.అదనపు కలెక్టర్‌ వెంకటేష్‌ ధోత్రే, డీఈవో రాజు, ఎంఈఓ రామస్వామి, ఈఈ దేవిదాస్‌ పాల్గొన్నారు.

వైరస్‌ ప్రభావంతో పందుల మృతి



ఆర్మూర్‌టౌన్‌ : వింత రోగంతో పందులు మృత్యువాత పడుతున్నాయి. ఆర్మూర్‌ పట్టణంలో ప్రతిరోజు సుమారు 30 పైగా పందులు మృతి చెందుతున్నట్లు మున్సిపల్‌ సానిటరీ ఎస్సై మహేశ్‌ తెలిపారు. స్వైన్‌ వైరస్‌ సోకడంతో పందులు చనిపోతున్నాయని వెటర్నరీ వైద్యులు చెబుతున్నారు. ఈ వైరస్‌తో చనిపోయిన పందులు ఉబ్బి బరువు పెరిగి పోవడంతో మున్సిపల్‌ సిబ్బంది చెత్త వాహనల్లో తరలించడానికి ఇబ్బందులు పడుతున్నారు. కాగా పందులకు సోకుతున్న వైరస్‌ నిర్ధారణ పరీక్షలను ఇప్పటి వరకు అధికారులు చేయించలేదు.